ధాన్యం కొనుగోళ్లకు మోక్షమెప్పుడో..

ఖానాపూర్ మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన ధాన్యం కుప్పలు

పంట పండించడం ఒక ఎత్తయితే విక్రయించడం ఇంకా గగనంగా మారుతోంది. 12 రోజుల నుంచే ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం వస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు. ఆకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిస్తే తమపై అదనపు భారం పడే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటే తరుగుపేరిట నష్టపోవాల్సి వస్తుందని అలా జరుగకముందే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. – ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 27

వసతి గృహంలో సౌకర్యాలు కరువు

కప్పర్ల ఎస్సీ వసతి గృహంలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

తాంసి మండలం కప్పర్ల గ్రామంలోని ఎస్సీ వసతి గృహంలో కనీస సౌకర్యాల కరువుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంటశాల గది శిథిలావస్థకు చేరుకోవడంతో భయాందోళనలో సిబ్బంది వంట పనులు చేస్తున్నారు. మరోవైపు మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్నానపు గదులు సరిపడే విధంగా లేక ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. విద్యార్థులు గదుల్లో నేలపైన నిద్రిస్తున్నారు. సంబంధిత అధికారులు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – తాంసి, అక్టోబర్ 27

పల్లె ప్రకృతి వనంపై పట్టింపేది..?

గాదిగూడలో వేల రూపాయలతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాటిన మొక్కలు ధ్వంసమై చెత్తాచెదారంతో నిండిపోయింది. పశువులు, మేకలు సంచరిస్తున్నాయి. మొక్కలు ఎండిపోగా ఏర్పాటు చేసిన పెన్సింగ్, ముఖద్వారం అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై చొరవ చూపి వాటిని వినియోగంలోకి వచ్చేలా చూడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు .-నార్నూర్, అక్టోబర్ 27

గాదిగూడలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భీంపూర్, అక్టోబర్ 27 : ఆదిలాబాద్‌లోని యాదవ సంఘ భవన ఆవరణలో బతుకమ్మ సంబురాలు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేశారు. బతుకమ్మ పాటలకు చప్పట్లు కొడుతూ గౌరమ్మను కొలిచారు. ఆదివారం తెల్లవారుజామున సమీప వాగులో నిమజ్జనం చేశారు. యాదవ సంఘ ప్రతినిధులు హన్మాండ్లు యాదవ్, మల్లయ్య యాదవ్, మహేందర్, సురేందర్, వేణు, రమేశ్ ఏర్పాట్లు చేశారు.

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రావుల శంకర్

బోథ్, అక్టోబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల శంకర్ అన్నారు. ఆదివారం బోథ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులందరికీ 250 గజాల ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఫ్రీ బస్సు సౌకర్యం, గుర్తింపు కార్డులతో పాటు అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం, అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు సురేశ్ వైద్య, అప్పాల శ్రీనివాస్ రెడ్డి, గంగయ్య, ఆనంద్, సమీర్, సత్యనారాయణ, దాస్, తిరుమల్, ఇమ్రాన్, సంతోష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

మరాఠీ భాష అస్తిత్వాన్ని కాపాడాలి

ఎదులాపురం, అక్టోబర్ 27 : మరాఠీ భాష అస్తిత్వాన్ని కాపాడేల కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమైన విషయమని మరాఠీ భాషిక్ జన కళ్యాణ్ జిల్లా కార్యదర్శి అనిల్ సావే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని పాత హౌసింగ్ బోర్డులోని పాత శిశుమందిర్‌లో మరాఠీ మీడియం ఉపాధ్యాయులను మరాఠీ భాషిక్ జన కళ్యాణ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి సేవలను కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డీఎస్సీలో 21 మంది మరాఠీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్ గుర్నూలే, రాథోడ్ సుభాష్, మనోహర్, విజయ్, శివాజీ, విఠల్, బాపురావ్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం

నార్నూర్/ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన మెస్రం జ్ఞానేశ్వర్-లక్ష్మి దంపతులకు కుమార్తె మెస్రం సాయిశ్రద్ధ నిరుపేద కుటుంబం నుంచి కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఉన్నత చదువుకు ఆర్థిక స్తోమత లేదు. అభిమన్యు గ్రూపు సభ్యులు స్పందించి దాతల వద్ద రూ.61వేలు సేకరించారు. విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీవీటీజీ ఏపీవో మనోహర్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గుపటేల్, అభిమన్యు నిర్వాహకులు మెస్రం శేఖర్ బాబు, మెస్రం లింగు, దీపక్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బాపురావ్, మెస్రం బాదు, ఆనంద్‌రావ్, గోవింద్ రావ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

ఇచ్చోడ, అక్టోబర్ 27 : జల్దా గ్రామానికి చెందిన అల్లెపు సంధ్య-రాములు దంపతుల కుమార్తె రామకుమారి(12) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ నిజామాబాద్‌లో చికిత్స పొందుతుంది. ఆదివారం అల్లెపు రాముతో పదో తరగతి చదువుకున్న మిత్రులంతా కలిసి రూ.15,500 ఆర్థిక సాయం అందజేశారు. పాప త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్రులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నిరాశ పర్చిన ప్రభుత్వం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 27 : పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో రాష్ట్ర ప్రభుత్వం ఒకటి మాత్రమే విడుదల చేయడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆరు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం (డీఏ) విడుదల చేస్తున్నదని తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బేల: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేల, అక్టోబర్ 27 : బేలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2016-17లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోల నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జీ), అక్టోబర్ 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని తరగతి గదులను పరిశీలించారు. 40 సంవత్సరాల తర్వాత అందరూ ఒకే చోట కలిసి అప్పటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

నర్సాపూర్(జీ): ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు కాటిపెల్లి సునీతారెడ్డి

తలమడుగు, అక్టోబర్ 27 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు కాటిపెల్లి సునీతారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తలమడుగులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు రూ.2500, కల్యాణ లక్ష్మి తులం బంగారం, మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షలు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. బతుకమ్మ పండుగకు ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో మహిళలను అవమానపర్చడం జరిగిందన్నారు. అంతేకాకుండా మహిళలకు బతుకమ్మ చీరలు ఇప్పటి వరకు పంపిణీ చేయలేదన్నారు. సమావేశంలో మహిళలు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయండి

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 27 : వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కోరారు. హైదరాబాద్‌లోని ప్రజా భవనంలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లాను, ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వంతో కలిసి అభివృద్ధికి నోచుకొని ప్రాంతాలను గుర్తించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

భైంసా, అక్టోబర్ 27 : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్ అన్నారు. ఆదివారం భైంసాలోని గురుకృపా జూనియర్ కళాశాలలో తెలంగాణ ఉద్యమ ఫోరం జిల్లా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ పండిత్ రావు, నాయకులు లస్మన్న, ఆంజనేయులు, దిగంబర్ పాల్గొన్నారు.

ఆరె మరాఠా సంఘం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

భైంసా, అక్టోబర్ 27 : ఆరె మరాఠా సంఘం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆరె మరాఠా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హన్మంత్ రావు అన్నారు. ఆదివారం భైంసాలోని బృందావన్ గార్డెన్‌లో ఆరె మరాఠా సంఘం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముథోల్ నియోజకవర్గంలో నూతనంగా ఉద్యోగాలు సాధించిన 43 మందిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంగాధర్, గౌరవాధ్యక్షుడు వసంత్ రావ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలాజీ బోస్లే, సంజయ్ పాటిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహనీయుల జీవితం అందరికీ ఆదర్శప్రాయం

ముథోల్, అక్టోబర్ 27: మహనీయుల జీవితం అందరూ ఆదర్శంగా తీసుకొని, స్ఫూర్తిదాయకంగా ఎదగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ముథోల్‌లో హిందూవాహిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. తానూర్-బైపాస్ రోడ్డు కూడలి వద్ద భగత్‌సింగ్, అన్నాబావు సాఠే విగ్రహాన్ని, ప్రధాన కూడలి వద్ద స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యం రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రమేశ్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, హిందూవాహిని అధ్యక్షుడు సారథి రాంకి, నాయకులు పాల్గొన్నారు.

సిరాల ప్రాజెక్టు పున:నిర్మాణానికి భూమిపూజ

భైంసాటౌన్, అక్టోబర్ 27: సిరాల ప్రాజెక్టు పున:నిర్మాణానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ భూమి పూజ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

భైంసాటౌన్, అక్టోబర్ 27 : దేగాం గ్రామానికి చెందిన బొగ్గుల సునీత (35) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భైంసారూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలకు వెళ్లితే.. సునీత పక్కింటి వారైనా చంద్రబాయి, ఆమె కూతుర్లు రాణి, భోజవ్వ మూడు నెలల నుంచి ఆమెతో గొడవ పడుతున్నారు. గొడవలను మనసులో పెట్టుకున్న తల్లి, కూతుర్లు శనివారం సునీతపై లేనిపోని నిందలు వేసి గ్రామస్తులందరి ముందు దూషించారు. దీంతో మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లగా భర్త పోతన్న సముదాయించి ఇంటికి తీసుకు వచ్చాడు. అందరి ముందు పరువు తీశారని బాధపడుతూ ఆమె రాత్రి భర్త నిద్రించిన తర్వాత పక్క గదిలోకి వెళ్ళి తాడుతో ఉరి వేసుకుంది. భర్త పోతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భైంసా రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి..

భైంసాటౌన్, అక్టోబర్ 27 : చింతల్ బోరి గ్రామానికి చెందిన సోనారి గంగాధర్(42) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భైంసారూరల్ ఏఎస్ఐ మారుతి వివరాల ప్రకారం.. గంగాధర్ నాలుగు సంవత్సరాల నుంచి అప్పు చేసి పేకాటాడుతూ మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది చున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భైంసా రూరల్ ఏఎస్ఐ మారుతి తెలిపారు.

జగ్గారెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

కుంటాల, అక్టోబర్ 27: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి బీఆర్ఎస్ సోషల్ మీడియా పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ పెంటవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సునీల్ కొనుగోలు నేతృత్వంలో చేస్తుందేమిటని మీ మ్యాని ఫెస్టోలో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకోలేదా .. గత ఎన్నికల ముందు 10 పెయిడ్ యూట్యూబ్ చానళ్లను పెట్టుకొని అసత్య ప్రచారాలు చేసి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇలాంటి బెదిరింపులు మానాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తు, నాయకులు వంశీకృష్ణ, సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం కమిటీకి సన్మానం

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 27: మాల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఇటీవల ఎన్నికయ్యారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సన్మానించారు. మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు మేకల మల్లన్న, ఆర్థిక కార్యదర్శి గంపల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఏర సుధీర్, సంయుక్త కార్యదర్శి రాజేశ్వర్, కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మాల సంక్షేమ సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్వరూప రాణి, సంఘం నాయకులు దేవన్న, భగవాన్లు, మొట్టె కిరణ్, రాళ్లబండి శంకర్, రాఘవేంద్ర, ముచ్చ రఘు, వెంకటస్వామి, అశోక్, జగదీశ్, అర్జున్ పాల్గొన్నారు.

ఎదులాపురం, అక్టోబర్ 27: మాల సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికైన వారిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో బేర దేవన్న, భగవాన్లు, మొట్టె కిరణ్, శంకర్, రాఘవేంద్ర, ముచ్చ రఘు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులను సన్మానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

సీఎంఈ సమావేశంలో రిమ్స్ వైద్యులు

పాల్గొన్న జిల్లా వైద్యులు

ఎదులాపురం, అక్టోబర్ 27 : కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న సీఎంఈ సమావేశానికి ఆదిలాబాద్ రిమ్స్ కళాశాల దవాఖానకు చెందిన వైద్యులు హాజరయ్యారు. ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాల కామారెడ్డిలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆదిలాబాద్‌కు చెందిన ఆర్థోపెడిక్ వైద్యులు హాజరయ్యారు. రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ ఆధ్వర్యంలో వైద్యులు కామారెడ్డికి బయలుదేరారు. ఈ సమావేశానికి డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ అనిల్ చిత్రాల, డాక్టర్ రాహుల్ పుష్కర్, ఆర్థోపెడిక్ వైద్యులు హాజరయ్యారు.

బీసీ గురుకుల క్రీడోత్సవాలు ప్రారంభం

ఎదులాపురం, అక్టోబర్ 27 : ఆదిలాబాద్‌లోని బీసీ బాలికల గురుకులం, కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 19 విభాగంలో ఆదిలాబాద్, జైనథ్, ఈదుల్ల సావర్గం, గన్నారం, కాగజ్‌నగర్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్, ఆసిఫాబాద్, మంచిర్యాల గురుకులాలకు చెందిన బాలికలు హాజరయ్యారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, చదరంగం, అథ్లెటిక్స్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, జిల్లా విద్యా శాఖాధికారి ప్రణీత హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నెమ్మని కీర్తి, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, వార్డు కౌన్సిలర్ పవన్ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెడ్మ రాము వర్ధంతి

ఇచ్చోడ, అక్టోబర్ 27 : ఇచ్చోడలో ఆదివాసులు ఆదివారం వెడ్మ రాము 37వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపూటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెప్టెంబర్ 28న అమెరికాలో గాళం వినిపించి తిరిగి వచ్చిన ప్రముఖ గాయకుడు రెల రవి చహకటిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వెడ్మ మారుతి, వెడ్మ రాములు, వెడ్మ విజయ్ ప్రకాశ్, చహకటి రవి, తోటి సంఘం అధ్యక్షుడు నైతం శేఖర్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షులు ఆత్రం మహేందర్, భీంరావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్, రాష్ట్ర కార్యదర్శి సోయం, విక్రమ్, మహిళలు పాల్గొన్నారు.

ముథోల్‌లో అరుదైన గధేగల్లు : అస్పష్ట శాసనం

ముథోల్, అక్టోబర్ 27 : నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో అరుదైన గధేగల్లును కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుర్తించారు. ఇది 12వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నట్లు బృందం సభ్యుడు, ఉపాధ్యాయుడు బలగం రామ్ మోహన్ తెలిపారు. ఇవి చాలా అరుదుగా కనిపిస్తాయని, తెలంగాణలో ఇది వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ అన్నారు. మహారాష్ట్ర, గోవా, గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో ఇవి కనిపిస్తున్నాయి. ఇది వాస్తవానికి దాన శాసనాలు. ముథోల్‌లో దొరికిన ఈ గధేగల్లు మీద కూడా అక్షరాలు అరిగి, 6 లేదా 7 వరుసల్లో రాయబడిన ఒక అస్పష్ట శాసనం ఉన్నది. లిపి తెలుగన్నడంను పోలినట్లు కనిపిస్తున్నది. ఈ గధేగల్లుపై మొదటి అంతస్తులో సూర్యచంద్రులు తరువాతి అంతస్తులో అస్పష్ట శాసనం, కింద అంతస్తులో లింగం, నంది, స్త్రీతో సంభోగం చేస్తున్న గాడిద బొమ్మలు ఒకదాని కింద ఒకటి చెక్కి ఉన్నాయి. సాధారణంగా గధేగల్లులు దాన శాసనాలుగా ఉంటాయి. కాబట్టి ఇది కూడా దాన శాసనం అయి ఉండవచ్చు. స్థానికులు రెవెన్యూ ఉద్యోగి అయిన సాయినాథ్, కండక్టర్ కందొల్ల భూమేశ్ సాయంతో కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు, ఉపాధ్యాయుడు బలగం రామ్‌మోహన్ గుర్తించారు.

తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నేరడిగొండ, అక్టోబర్ 27 : తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీని ఆదివారం నేరడిగొండలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాథోడ్ కమల్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా దావుల భోజన్న, మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు రమేశ్, కార్యదర్శిగా జాదవ్ కపిల్, చంద్రశేఖర్‌యాదవ్, సంయుక్త కార్యదర్శిగా మోహన్‌రెడ్డి, రహీం, రవి, కోశాధికారిగా సయ్యద్ జహీర్, సభ్యులుగా సలీం, పర్చుసింగ్, మహేందర్‌రెడ్డి, వీఎన్ రాజేశ్వర్, రాజు, గంగారెడ్డి, రాములునుఎన్నుకున్నారు.

అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 27 : నిర్మల్ జిల్లాలో అనుమతులు లేకుండా వ్యాపారులు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల హెచ్చరించారు. నిర్మల్ జిల్లా పట్టణ పరిసర ప్రాంత పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, సరైన భద్రత ప్రమాణాలు లేకుండా దుకాణాలను ఏర్పాటు చేసిన, విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

బేల, అక్టోబర్ 27 : సాంగిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఐదుగురు వైద్యనిపుణులు 300 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్ రెడ్డి, రంజిత్ కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భైంసా, అక్టోబర్ 27 : ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నాయకుడు ముత్యం పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో పోస్టర్ విడుదల చేశారు. ఈ నెల 31వ తేదీన యూనియన్ కార్యాలయంలో పతాకావిష్కరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ, లక్ష్మణ్, గంగాధర్, రమేశ్, రాములు పాల్గొన్నారు.

ఒక డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో అసంతృప్తి

భైంసా, అక్టోబర్ 27 : ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 8 నెలలు కావస్తున్నా క్యాబినెట్ సమావేశంలో ఐదు డీఏలకు బదులు ఒక డీఏని ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ